క్లుప్తంగా

మంచి ఆహార అలవాట్లతో జీర్ణకోశ వ్యాధులు దూరం



పెనమలూరు: మంచి ఆహార అలవాట్లతో జీర్ణకోశ వ్యాధులకు దూరంగా ఉండొచ్చని కానూరు నాగార్జున ఆస్పత్రి ఎండీ డాక్టర్ కొడాలి జగన్‌మోహన్‌రావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ వాకర్స్ క్లబ్, కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జీర్ణకోశ వ్యాధుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంక్‌ఫుడ్‌తో జీర్ణకోశ వ్యాధులు వస్తాయని తెలిపారు. జీర్ణకోశ క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలో వివరించారు. రోజూ వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, సెక్రటరీ సతీష్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వాకర్స్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ



కంకిపాడు: భూ సార పరీక్షలు తప్పకుండా చేయాలని, రైతులకు అవగాహన కల్పించాలని రైతుశిక్షణ కేంద్రం ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. కంకిపాడులో వీఏఏలకు భూ సార పరీక్షలపై ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ భూమిని కాపాడుకుంటే మేలైన పంట దిగుబడులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్, మండలంలోని వివిధ గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై రైతుల దృష్టి



కంకిపాడు: యాంత్రీకరణ వైపు రైతులు దృష్టి సారించాలని, వాటి ప్రయోజనాలను తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ సూచించారు. శక్తిమాన్ రొటవేటర్స్ కంపెనీ నిర్వహించిన లక్కీడ్రాలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విజేతలుగా నిలిచిన ఎనిమిది మందికి ఫోన్‌లు, ఫ్రిజ్‌లను బహుమతులుగా ఆదివారం అందించారు. పట్టణంలోని కంపెనీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఓ కిరణ్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్ర పరికరాలను వినియోగించి సాగులో నూతన పద్ధతులను అవలంబించాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడుగురు కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని పెనమలూరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.5,200 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా బాపులపాడు మండలం ఆరుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమాన్ జంక్షన్ సీపీడీసీఎల్ ఏఈ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓగిరాల, చిరివాడ, తిప్పనగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్య వివరాల సేకరణ

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో ఆదివారం ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించాయి. గ్రామంలోని గంగానమ్మ గుడి ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయి నీరు కలుషితం అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ తక్షణం స్పందించింది. 50 గృహాలను సందర్శించి ఇంటింటికీ ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. అయితే ఏ ఒక్కరికీ వాంతులు, విరేచనాలు లక్షణాలు లేవని డాక్టర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హరిమోహన్ ఆదేశాల మేరకు ఏఈ షకీల్ గ్రామంలో పర్యటించి మంచినీటి పైప్‌లైన్‌ల లీకులు గుర్తించారు. లీకుల ప్రాంతాల్లో నీటిని తాగవద్దని గ్రామస్తులకు సూచించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కళావేదికపై విజయవాడకు చెందిన అనురాధ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై రిషిత, భావన, రిజాత, జానకీ, భావన, ఆదిత్య, దేవి, కావ్య ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భూసారంతోనే భవిత

మట్టి పరీక్షతో పొలానికి రక్ష

- నేలతల్లిని కాపాడుకోవడం అత్యవసరం
- ఎరువుల వాడకాన్ని అదుపులో ఉంచుకోవాలి
- మట్టి పరీక్షల ఆధారంగా యాజమాన్యం తప్పనిసరి
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయశాఖ
- ఇప్పటికే వీఏఏలకు శిక్షణ పూర్తి



మట్టి నమూనాల సేకరణపై వర్క్‌షాప్(ఫైల్ ఫొటో)

కంకిపాడు: నేలతల్లిని పరిరక్షించుకోవాలి. భూసారాన్ని కాపాడుకోవాలి. అప్పుడే పంటలు బాగా పండుతాయి. నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూమి పటుత్వం కోల్పోతోంది. చౌడు నేలలుగా, సమస్యాత్మక భూములుగా మారుతున్నాయి. సాగుకు పెట్టుబడి వ్యయం భారీగా పెరుగుతుంది. దీనిని అధిగమించాలంటే రైతులు ప్రధానంగా చేయవలసినది రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. అలాగే ఏటా భూసార పరీక్షలు చేయించడం కూడా ముఖ్యమే. ఈ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించడానికి జిల్లా వ్యవసాయశాఖ సమాయత్తమైంది. మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలకు తరలించే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను పూర్తి చేసి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించింది.

ఇదే సరైన సమయం..

కృష్ణా జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల హెక్టార్లలో వ్యవసాయ శాఖ పరిధిలో వివిధ రకాలైన పంటలను సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ పరిధిలో 17,127 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయి. 40 హెక్టార్లలో సెరీ కల్చర్ సాగులో ఉంది. వేసవిలో చాలా వరకూ భూములు ఖాళీ అవుతాయి. వేసవి దుక్కులు, భూ యాజమాన్య చర్యలు చేపట్టేందుకు ఏప్రిల్, మే, జూన్ నెలలు అనువు. ఈ సమయంలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపి, వచ్చిన ఫలితాల ఆధారంగా భూమి యాజమాన్య చర్యలు తీసుకోవాలి. అప్పుడే పంట దిగుబడులు ఆశాజనకంగానూ, నాణ్యంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో మట్టి పరీక్షలకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంది.

జిల్లా స్థాయిలో శిక్షణపూర్తి..

మట్టి పరీక్షలపై ఇప్పటికే జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ పూర్తి చేసింది. ఈనెల 12న ఉయ్యూరు కేంద్రంలో జిల్లాలోని 25 మండలాల పరిధిలో ఉన్న ఏడీఏలు, ఏఓలు, మండలానికి ఒకరు చొప్పున ఎంపిక చేసిన వీఏఏకి మట్టి నమూనాలను ఎలా సేకరించి, మట్టి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన వీఏఏలు, ఆయా మండలాల ఏఓల పర్యవేక్షణలో మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 16తో పూరయ్యాయి. ఈ శిక్షణ క్రమంలో ఒక్కో వీఏఏ రెండు చొప్పున మట్టి నమూనాలను సేకరించి, మట్టి నమూనా సేకరణ, ప్యాకింగ్, భూసార పరీక్ష కేంద్రానికి తరలించే విధానంపై శిక్షణ పొందుతారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో సేకరించిన మట్టి నమూనాలను బాపట్లలోని రీజనల్ భూసార పరీక్ష కేంద్రానికి పంపి, అక్కడ నిపుణులతో మట్టి పరీక్షలు చేయించి ఫలితాలను నమోదు చేస్తారు.

జిల్లా వ్యవసాయ శాఖ షెడ్యూల్ ప్రకారం..

శిక్షణ పూర్తి చేసుకున్న వీఏఏలు వారికి కేటాయించిన గ్రామాల్లో జిల్లా వ్యవసాయశాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంటుంది. సేకరించిన మట్టిని పరీక్ష నిమిత్తం జిల్లాలోని వ్యవసాయ ల్యాబ్‌లలోనూ, భూ సార పరీక్ష కేంద్రాల్లోనూ, ఏఎంసీ గుడివాడ, మచిలీపట్నంలో ఉన్న ల్యాబ్‌లలో పరీక్షకు పంపాలి. తద్వారా వచ్చిన మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా భూ, పంటల యాజమాన్యం చేపట్టాలి. దీని వల్ల భూమికి అవసరమైన పోషకాలు అందటం ద్వారా ఆరోగ్యంగా ఉంటుంది. పంట దిగుబడులు నాణ్యతాయుతంగా ఉంటాయి. భావి తరాలకు భద్రత చేకూరేలా భూమి పరిరక్షణ జరుగుతుంది. అన్నింటికీ మట్టి పరీక్షలే మూలం.

నేలను కాపాడుకోవాలి..



ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగానే యాజమాన్యం చేపట్టి పంట దిగుబడులు సాధించాలి. తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది మట్టి పరీక్షలను చేపట్టి విజయవంతం చేయాలి. రైతుల్లో అవగాహన పెంచాలి.

– ఎం.విజయభారతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

పారిశుద్ధ్య కార్మికులకు రాగిజావ పంపిణీ



రాగిజావ అందజేస్తున్న సర్పంచ్ నిడమర్తి సౌజన్య, తదితరులు

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు రాగిజావ పంపిణీ చేశారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా రాగిజావను 63 మంది కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ..గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకపాత్ర వహిస్తున్నారని చెప్పారు. కోవిడ్ కష్ట కాలంలో కూడా ఫ్రంట్ లైన్ వర్కర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని తెలిపారు. ఇటువంటి కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తమవంతుగా రాగిజావను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ద్వారా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, పీడీ ధనియాల నాగరాజు, వాకర్స్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుడపాటి రాంబాబు, అనిల్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య ఉన్నతికి దోహదం

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

గన్నవరం: నైతిక విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక స్రవంతి హైస్కూల్‌లో 2022–23 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొమ్మినేని మాట్లాడుతూ..విద్యార్థులను కేవలం చదువులకే పరిమితం చేయకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సాహించాలని చెప్పారు. అప్పుడే జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించి లక్ష్య సాధన వైపు ముందుకు వెళ్తారని తెలిపారు. ఈ దిశగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు మాతృభాషతో పాటు ఆంగ్లంపై కూడా విద్యార్థులు పట్టు సాధించాలని చెప్పారు. తొలుత ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కొమ్మినేని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే.ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం సేవలు చిరస్మరణీయం



వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న 'మానవత' సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం సేవలు చిరస్మరణీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో 'మానవత' ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరేశలింగం చిత్రపటానికి పలువురు 'మానవత' సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను ఎదిరించి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేశారని కోటేశ్వరరావు కొనియాడారు. స్త్రీ విద్య కోసం ఉద్యమించి, ప్రత్యేకంగా బాలికల కోసం పాఠశాలలను స్థాపించారని వివరించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని, అంతరానితనంపై పోరాడారని అన్నారు. 'మానవత' హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సీనియర్ సభ్యులు ఘంటా సత్యనారాయణ, నారగాని కొండలరావు, దయాల ప్రభాకరరావు, పొట్లూరి శేషాచలం, వడ్డి రాజేశ్వరరావు, గూడపాటి జయరామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాలను సాధించుకోవాలి



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

కంకిపాడు: పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని వక్తలు సూచించారు. కోలవెన్ను జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో దాతలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, ఉన్నత విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదగాలన్నారు. దాత శశికళ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు భోజనం చేసేందుకు రూ 3.50 లక్షలు వితరణ ఇచ్చి షెడ్డు నిర్మాణం చేసి పాఠశాలకు అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ తుమ్మల ఆంజనేయులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతలు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, తుమ్మల సాయి వెంకట మనోజ్, తుమ్మల అజయ్‌బాబు, వెల్లంకి శ్రీనివాస వరప్రసాద్ రూ.70 వేలు వితరణగా ఇచ్చారు. ఈ సొమ్ముతో విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, హెచ్‌ఎం అరుణకుమారి, ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. నిఘా ఉంచాం

సీఐ నరసింహమూర్తి



హాస్టల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జంక్షన్ పోలీసులు

ఉంగుటూరు: ఆడ పిల్లల రక్షణకు పోలీసులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఆందోళనల చెందవద్దని పోలీసులు అభయమిచ్చారు. గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని బాలికల గురుకుల పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తి హాస్టల్లోకి ప్రవేశించారనే అనుమానంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆదోళన చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య ఫిర్యాదు మేరకు హనుమాన్ జంక్షన్ సీఐ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాసరావు, సిబ్బంది పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పై అంతస్తు నుంచి తాడు వేలాడుతూ ఉండటాన్ని గుర్తించి హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం బాలికల రక్షణ కోసం రాత్రి సమయంలో ఓ మహిళా పోలీసును కాపలాకు ఏర్పాటు చేశామన్నారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లతో గస్తీ, నైట్ రౌండ్స్ ఆఫీసర్ రాత్రి సమయంలో ఆ ఏరియాలో గస్తీ తిరగాలని ఆదేశించారని చెప్పారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



కేసరపల్లిలో పథకాలు వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి తదితరులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆయనను రాష్ట్ర ప్రజలందరూ నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని కోరారు. పార్టీ నాయకులు ఆర్‌వీఆర్, నీలం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరిగింది. తెంపల్లి, ముస్తాబాద గ్రామాల్లో సచివాలయం కన్వీనర్‌లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి పోస్టర్‌లు అంటించారు.

సీఎం జగన్ పాలనకు ప్రతి ఇంటా ఆదరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఇంటా విశేష ఆదరణ పలుకుతున్నారని గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ గండేపూడి రాణి అన్నారు. బాపులపాడు మండలంలోని బొమ్ములూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల మంజూరు కోసం ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సివచ్చేదని, కానీ నేడు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. బాపులపాడు పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. ప్రజల అనుమతితో ఇళ్లకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. ఎంపీటీసీ సభ్యురాలు కుందేటి శిరీష, వైఎస్సార్ సీపీ నాయకులు హృదయరాజు, రంగారావు, కుందేటి రాంబాబు, కొలవెంటి రమేష్, పాలిమెట్ల రాణి, రేమల్లే రాయప్ప, పచ్చిగళ్ల యోహాను, కంచి సీతారామయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. తెల్లవారుజామున సుప్రభాతసేవ, అనంతరం ప్రత్యేక అర్చనలు చేశారు. సుదర్శన హోమం, ఆదిత్యహృదయ హోమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, శ్రీచక్రస్నానం వైభవంగా జరిగింది. వేలేరుకు చెందిన వెంకటేశ్వర ఆవిర్నేని తారక బ్రహ్మం, దోనవల్లి పుష్పావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు, తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం స్వామి, గొల్లపల్లి రఘునాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, పుర ప్రముఖులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, కనిగంటి రంగారావు, చలసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవటం మాకిష్టం'

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివించడం, చెప్పించడంతో పాటు సామూహిక పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాలన్నారు. అప్పుడే చిన్నవయస్సు నుంచే విద్యార్థుల్లో మేధాశక్తి, పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ వంటి మంచి లక్షణాలు అలవడుతాయని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం గ్రంథాలయంలో జరిగే చదవటం మాకిష్టం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం క్యారమ్ బోర్డు, చెస్ బోర్డును బహుమానం చేసిన గ్రంథాలయ పాఠకుడు మనోజ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకుడు వినోద్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు అక్కినేని అఖిల్ సందడి



అఖిల్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో సినీనటుడు అక్కినేని నాగార్జున తనయుడు అఖిల్ అభిమానులతో సందడి చేశారు. ఏకే ఎంటర్ ప్రైజెస్ బ్యానర్‌పై సుంకర రాంబ్రహ్మం నిర్మాతగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో అక్కినేని అఖిల్, సాక్షి విద్య కథానాయకులుగా నూతనంగా నిర్మించిన ఏజెంట్ చిత్రం ఈ నెల 28న విడుదల సందర్భంగా అభిమానులతో ఫొటో షూట్ ఆదివారం నిర్వహించారు. అక్కినేని నాగార్జున, అఖిల్ ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.సర్వేశ్వరరావు నేతృత్వంలో అఖిల్‌కు ఘన స్వాగతం పలికారు. ఫొటో షూట్ అనంతరం అఖిల్‌ను గజమాలతో సత్కరించారు. సినీ నిర్మాత రాంబ్రహ్మంతో అఖిల్ కొద్ది సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రాంబ్రహ్మం మాట్లాడుతూ ఈ నెల 18న ఏజెంట్ చిత్రం ట్రైలర్ రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

'మహాభారత యక్ష-ధర్మజ ప్రశ్నోత్తర' పద్యశతకం పుస్తకావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శతక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణ రచించిన మహాభారత యక్ష–ధర్మజ ప్రశ్నోత్తర పద్యశతకం పుస్తకాన్ని మారుతీ గ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న ఆవిష్కరించారు. సత్యనారాయణపురం మారుతీ గ్యాస్ కంపెనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తాను రచించిన పుస్తకాన్ని తన భార్య ఉప్పులూరి భారతీదేవికి అంకితం ఇస్తున్నానన్నారు. తాను పుస్తకం రచించేందుకు సహకరించిన శారదా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నలూరి లక్ష్మణరావు, చెట్లపల్లి మారుతీప్రసన్నకు కృతజ్ఞతలు తెలితదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత అని డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయి సుధాకర్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత వేముల భానుప్రకాష్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. 190 నెలలుగా వయోవృద్ధులకు సేవలు అందిస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ వేముల భానుప్రకాష్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో తాను భాగస్వామి కావటం ఆనందంగా ఉందన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ, సీనియర్ జర్నలిస్ట్ కరణం కళ్యాణ్‌కృష్ణ కుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు, ఉపాధ్యాయురాలు కె.రమాగాయత్రి మాట్లాడారు. అనంతరం వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షులు గుండు దిలీప్, ట్రస్ట్ సభ్యులు ఎన్వీయూ సతీష్‌కుమార్, పి.లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.